క్లుప్తంగా

చికెను ముక్క.. భౌలే చౌక!

రొంపిచెర్ల: రొంపిచెర్లలో కిలో చికెన్ రూ.120లకు విక్రయించారు. చికెన్ వ్యాపారులు పోటాపోటీగా ధరలను తగ్గించి విక్రయిస్తుండడంతో ప్రజలు ఎగబడి కొంటున్నారు. గత నెల చివరి వరకు కిలో చికెన్ రూ.220 ధర ఉండేది. కార్తీక మాసం కావడంతో ధరలు పడిపోయాయి. అయితే చికెన్ హట్ వారు ఒక్కసారిగా కిలో చికెన్ రూ.120 బోర్డులు తగిలించడంతో పోటీ పైన వ్యాపారులు కూడా ఇదే బాట పట్టారు. దీంతో జనం చికెన్ కొనుగోలుకు ఎగ బడుతున్నారు.

సచ్ఛంద సంస్థకు విరాళం

పుంగనూరు: పట్టణంలోని మానవత స్వచ్ఛంద సంస్థకు విశ్రాంత ఉపాధ్యాయుడు ఏసీ.నారాయణరెడ్డి రూ.10 వేలను విరాళంగా మంగళవారం ఇచ్చారు. సంస్థ ప్రతినిధి నానబాల గణేష్‌కు ఈ సొమ్ము అందజేశారు. సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సాయం చేసినట్టు ఆయన చెప్పారు.

నేరాల నియంత్రణకు కృషి



పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

రొంపిచెర్ల: నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేకంగా కృషి చేయాలని డీఎస్పీ శ్రీనివాస మూర్తి ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. గ్రామాల్లో రాత్రి పూట గస్తీ నిర్వహించాలన్నారు. ప్రజలతో స్నేహ పూరితంగా మసలుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కృష్ణయ్య. పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మురళీకృష్ణ

గంగవరం: పలమనేరు మున్సిపాలిటీలోని కొత్తపేట వార్డు సచివాలయంలో అర్హులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సంరక్షణ పథకం కింద ఆయుష్మాన్ భారత్ కార్డులను కౌన్సిలర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. వార్డు సచివాలయ పరిధిలో మొత్తం 1,300 మంది ప్రజలకు ఈ కార్డులు అందజేసినట్టు కౌన్సిలర్ చెన్నారు. ఈ కార్డులు పొందిన వారు దేశంలోని ఎంపానెల్ ఆసుపత్రుల్లో ఏడాదికి రూ. 5లక్షల వరకూ డబ్బులు చెల్లించకుండా ఉచితంగా చికిత్స పొందవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో మారెమ్మ

పుంగనూరు: పుంగనూరు పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చర్చిలో 'క్రిస్మస్ ఈవ్'

పుంగనూరు: పట్టణంలోని హట్టన్ మెమోరియల్ చర్చిలో మంగళవారం క్రిస్మస్ ఈవ్ వేడుకలు నిర్వహించారు. సంఘ కార్యదర్శి రవికుమార్, సురేష్ క్రిష్టఫర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు అన్నదానం చేశారు. అలాగే కేక్ కట్ చేశారు. అనంతరం వాక్య సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, క్షమ, దయ గుణాలతో ముందుకువెళితే సమాజంలో అశాంతి, అస్థిరత ఉండదన్నారు. రాజ్‌కుమారి, సుధాకర్, సత్యరాజ్, దైవప్రకాష్ పాల్గొన్నారు.

నేడు కుల గణన సర్వేపై సమీక్ష

గంగవరం: పలమనేరులో కుల గణన సర్వే 2023కి గాను బుధవారం సాయంత్రం 4గంటలకు పురపాలక కార్యాలయంలో సమీక్షించనున్నట్టు కమిషనర్ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమీక్షకు వార్డు కౌన్సిలర్లు, పట్టణంలోని మత పెద్దలు, కుల పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జీఓ సభ్యులు హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

శాంతిపురంలో..

శాంతిపురం: కుల గణన సర్వేపై బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సచివాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొనాలని ఆమె కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గాజులేరు

- తలకోన అడవిలో భారీ వర్షం
- మొరవ పోతున్న ఏటీ చెరువు
- కాకులారంపల్లె మార్గంలో దెబ్బ తిన్న తారు రోడ్డు
- మేకలవారిపల్లె వద్ద కల్వర్టు లీకేజీ



మొరవ పోతున్న ఏటీ చెరువు

రొంపిచెర్ల: మండలంలో మిచాంగ్ తుపాను ప్రభావం మూలాన కురుస్తున్న వర్షాల ధాటికి రోడ్లు దెబ్బ తిన్నాయి. తలకోన అడవులలో కురిసిన భారీ వర్షానికి గాజులేరు, కప్పులేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో మండలంలోని ఏటీ చెరువు నిండి మొరవ పారుతోంది. అలాగే ఏటీచెరువు మొరవ నీరు, తలకోన అడవుల నుంచి వస్తున్న నీరు చల్లింపల్లె ప్రాజెక్టు చేరుతోంది. చల్లింపల్లె ప్రాజెక్టు కూడా 24 గంటలలో నిండి మొరవ పోయే అవకాశం ఉందని రైతులు చెప్పారు. తలకోన నుంచి వస్తున్న నీటి ఉధృతికి మండలంలో టమాట, వేరుశనగ, వరి, ఉలవ పంటలు కూడా దెబ్బ తిన్నాయి. పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీ సమీపంలోని మేకలవారిపల్లె వద్ద కల్వర్టుకు గండి పడింది. దీంతో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర ఆ ప్రాంతాలను పరిశీలించారు. వర్షం తగ్గుముఖం పట్టడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

దెబ్బ తిన్న పంటలకు పరిహారం

వర్షానికి దెబ్బ తిన్న పంటలను రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జిలు గుర్తించాలని ఎంపీపీ అన్నారు. ఆయన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమీక్షించారు. పంటలు దెబ్బ తిన్న ప్రతి రైతుకూ పరిహారం మంజూరు చేస్తామని ప్రకటించారు. రెండు రోజులలో నివేదికలను జిల్లా అధికారులకు పంపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్ర, మండల వ్యవసాయాధికారి సుధారాణి, ఆర్‌బీకే ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

125 ఎకరాల్లో వరి పంట నష్టం

సదుం: తుపాను ప్రభావంతో మండలంలో 125 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షం మంగళవారం మధ్యాహ్నానికి తెరపినిచ్చింది.



దెబ్బ తిన్న కాకులారంపల్లె రోడ్డు



మేకలవారిపల్లె వద్ద కల్వర్టు లీకేజీని పరిశీలిస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

ఓటరుగా నమోదు చేసుకోండి



బీఎల్ఓలతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్

సోమల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెల 9వ తేదీలోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం బీఎల్ఓలతో సమీక్షించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శివకుమార్, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, రీసర్వే డీటీ రామ్మూర్తి, ఆర్ఐ సుబుక్తుల్లా పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు సిబ్బంది కృషి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లక్ష్మీప్రసన్న ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. జాబితాలో డబుల్ ఎంట్రీలు, అనర్హులు, చనిపోయిన వారిని గుర్తించి, వారి పేర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్, డీఈ రమణ, తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని ఎస్‌డీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి యూసుఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల పాటు ఓటర్ల నమోదు, మార్పులు–చేర్పులు, తొలగింపులు నిర్వహించి, జాబితాలను రెవెన్యూ అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షా, ముబారక్, సిద్ధిక్, యూనుస్, నూర్, షాహిద్ పాల్గొన్నారు.

ఎస్ఐకు వీడ్కోలు సన్మానం



ఎస్ఐ రవికుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చౌడేపల్లె: రెండున్నరేళ్ల పాటు చౌడేపల్లె పోలీస్ స్టేషన్‌లో పనిచేసి మదనపల్లె తాలూకా స్టేషన్‌కు బదిలీ అయిన ఎస్ఐ రవికుమార్ సేవలు అభినందనీయమని ఎంపీపీ రామమూర్తి కొనియాడారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీనేతలు కలిసి ఆయన వీడ్కోలు సన్మానం ఏర్పాటు చేశారు. పలువురు వక్తలు ఆయన సేవలను ప్రస్తుతించారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడంతోపాటు బోయకొండలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ఆయన ప్రజల మన్ననలు అందుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, మాజీ ఎంపీపీలు రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, వైఎస్సార్ సీపీ చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ విభాగం యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు, ఎంపీడీఓ సుధాకర్, వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, బోయకొండ కమిటీ మాజీ డైరెక్టర్ ఠాణాదార్ నాగరాజ, ఆర్యవైశ్య వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు నూజిళ్ల నాగరాజ, బీసీ సెల్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు వెంకటరమణ, గోవిందయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

భరత్‌ను గెలిపించండి



మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ

కుప్పం: కుప్పం ఎమ్మెల్సీ భరత్‌ను ఈసారి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిపించాలని ఆయన భార్య దుర్గ కోరారు. మంగళవారం కుప్పం మున్సిపాలిటీ 23వ వార్డు మునుస్వామి పురం ప్రాంతంలో ఆమె మంగళవారం పర్యటించారు. మహిళలకు సారె కింద చీరలు, పసుపు–కుంకుమ అందజేసి ఆమె మాట్లాడారు. 35 ఏళ్లుగా చంద్రబాబును గెలిపిస్తున్నా ఆయన ప్రజలకు అందుబాటులో లేరని, అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నాయకుడి నియోజకవర్గంలో సైతం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందని స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్న భరత్‌ను గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబు మాయమాటలు, దగా హామీలు నమ్మరాదని విజ్ఞప్తి చేశారు.

సరిహద్దులో చిరుత సంచారం



రోడ్డుపై సంచరిస్తున్న చిరుత

రామకుప్పం: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని వెంకటాపురం, కర్ణాటక రాష్ట్రంలోని దళవాయి కొత్తపల్లె గ్రామాల మధ్య చిరుత సంచారంపై ప్రజలు సెల్‌ఫోన్లలో తీశారు. కర్ణాటక అటవీ అధికారులు చిరుతను బంధించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి ఆంధ్రలోని గ్రామాల వైపు చిరుత వస్తుందన్న భయంతో ప్రజలు హడలిపోతున్నారు.

బైక్ సహా సారా స్వాధీనం

పెద్దపంజాణి: ద్విచక్ర వాహనంతో సహా సారాను సీజ్ చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని రాయలపేటలో మంగళవారం ఎస్ఐ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. చౌడేపల్లె మండలం బుటకపల్లెకు చెందిన పెద్దు నుంచి 8 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మురళీమోహన్

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కట్టమంచి, దొడ్డిపల్లి ప్రాంతాల్లో మంగళవారం దాత పార్థసారథి నాయుడు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ దుప్పట్లను తహసీల్దార్ మురళీమోహన్ చేతుల మీదుగా పేదలకు అందజేశారు. పార్థసారథి నాయుడు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీకాంత్, సహదేవన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్

యాదమరి: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌పై గ్రామీణులకు అవగాహన కల్పించాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ యాప్‌ను ప్రజల స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ఈ యాప్‌లో తెలుసుకోవచ్చని, అలాగే ఏఏ ఆసుపత్రులలో ఎలాంటి వైద్యసేవలు అందిస్తున్నారో కూడా అందులో నిక్షిప్తం చేసి ఉంటారన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పైరు



నీళ్లు చేరిన వరి పంటను చూపిస్తున్న రైతు, పక్కన మండల వ్యవసాయాధికారిణి

పూతలపట్టు: తుపాను ప్రభావం మూలాన కురిసిన వర్షం, పెనుగాలులకు మండలంలోని గాండ్లపల్లె, తేనేపల్లె పంచాయతీలోని గ్రామాల్లో కోతకొచ్చిన వరి పైరు నేలకొరిగింది. తుంబవారిపల్లెకు చెందిన రైతు కృష్ణారెడ్డి 3 ఎకరాలలో సాగు చేసిన పంటలో వర్షపు నీరు చేరింది. మండల వ్యవసాయాధికారిణి మధురవాణి మంగళవారం బాధిత రైతు పొలాన్ని పరిశీలించారు. నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె చెప్పారు. అలాగే, తేనేపల్లె పంచాయతీలో కూడా వరి పంటల్లో ఇదే పరిస్థితి కనిపించింది.

చెరువు కాలువ ఆక్రమణ



గతంలో ఉపాధి పనులు చేసిన కాలువ (ఫైల్)



ప్రస్తుతం రాళ్లతో పూడ్చేసి ఆక్రమణకు గురైన కాలువ

గంగవరం: మండలంలోని జీడిమాకులపల్లె పంచాయతీ కొంగోళ్లపల్లెకు ఆనుకుని ఉన్న కానుగల చెరువు కాలువ ఆక్రమణకు గురైంది. గ్రామానికి తరతరాలుగా ఈ కాలువ మీదుగా ప్రవహించే నీటితోనే రైతులు పంటలు సాగు చేసేవారు. అయితే కొంతకాలానికి కాలువ మట్టితో పూడిపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోవడంతో ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు చేయాలని గతంలో గ్రామస్తులు అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఆరు నెలల క్రితం ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ఉపాధి కూలీలతో పనులు చేసి దాదాపు 70 మీటర్ల పొడవు రూ.30వేలతో ఈ కాలువ పూడికతీత పనులు చేశారు. ఈ నేపథ్యంలో కానుగల చెరువుకు ఆయకట్టుగా ఉన్న కాలువను ఆ కాలువకు ఆనుకుని ఉన్న భూ యజమాని కాలువను రాళ్లతో పూడ్చేసి పూర్తిగా ఆక్రమించుకున్నట్టు రైతులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణ నుంచి కాలువకు విముక్తి కల్పించి, పునరుద్ధరించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ అమర్నాథ్ వివరణ కోరగా..కాలువ ఆక్రమణపై ఇంత వరకూ ఫిర్యాదు ఎవరూ చేయలేదని, అర్జీ ఇస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉగ్రరూపం దాల్చిన కుశస్థలి



పొంగి పొర్లుతున్న కుశస్థలి నది

- మిచాంగ్ తుపాన్ ప్రతాపం
- వంతెనను తాకుతూ పారిన ఉయ్యాల కాలువ
- జలమయమైన పలు ప్రాంతాలు
- శరవేగంగా సహాయక చర్యలు

నగరి : మిచాంగ్ ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా ఈదురు గాలులతో కూడిన జోరువర్షం కురిసింది. నగరి మండలంలో 309.2 మిల్లీమీటర్ల వర్షం నమోదు కాగా, విజయపురంలో 278.8, నింద్రలో 226 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం అధికంగా కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కృష్ణాపురం డ్యాం గేట్లు తెరిచిన కారణంగా కుశస్థలి నదిలో నీరు పొంగి పొర్లింది. ముందస్తు జాగ్రత్తగా కీళపట్టు లోతట్టు వంతెనకు ఇరువైపులా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉయ్యాల కాలువ పొంగి పొర్లడంతో టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ కాలనీ, కాకవేడు ఏఏడబ్ల్యూ, సాయినగర్, అశోక్ నగర్ ప్రాంతాలు జలమయమయ్యాయి. తడుకుపేట శెట్టిగుంట ఎస్టీ కాలనీలో నివాసాల్లోకి నీరు చేరింది. వారికి వైస్ ఎంపీపీ కన్నియప్ప, స్థానిక నాయకుడు రాజేంద్ర ఆహారం పొట్లాలను పంపిణీ చేశారు. కీళపట్టు చెరువు పొంగి పొర్లడంతో నలుగురు రైతులకు చెందిన 14 ఎకరాల వరిపంట నీట మునిగింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న ఉయ్యాల కాలువ



జలమయమైన కాకవేడు ఏఏడబ్ల్యూ

నవరత్నాలతోనే పేదరిక నిర్మూలన



పుంగనూరు: డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా



వి.కోట : మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యమైందని, అలాగే ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందిందని మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా పేర్కొన్నారు. మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పట్టణంలోని నానబాలవీధి సచివాలయంలో నిర్వహించారు. వార్డులో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. డిజిటల్ బోర్డులను ఆవిష్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్టు స్పష్టం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలా అభివృద్ధి చేయలేదని, ఇది ప్రజలు గుర్తెరిగి వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నయీంతాజ్, కాళిదాసు, సచివాలయాల కన్వీనర్ వరదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కిషోర్, ఇంతియాజ్, రమణ , అస్లాం మురాధి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలును మరువద్దు

వి.కోట: గత టీడీపీ పాలనతో పోల్చితే జగనన్న ప్రభుత్వం ప్రజలకు ఎంతగానో మేలు చేసిందని, ఇది మరచిపోకుండా మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకుందామని ఎంపీపీ యువరాజు పిలుపునిచ్చారు. మంగళవారం కృష్ణాపురం పంచాయతీ గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు తప్ప మేలు జరిగిందేమీ లేదని పెదవి విరిచారు. ఒక్కో సచివాలయ పరిధిలోనే కొన్ని కోట్ల రూపాయలతో అభివద్ధి చేశామన్నారు. కృష్ణాపురం పంచాయతీలో ఇప్పటివరకు రూ.35.32కోట్లను అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వ్యయం చేసినట్టు చెప్పారు. ప్రజలు ఇది గుర్తెరిగి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. తొలుత పార్టీ జెండాను, సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్లు గోపిరెడ్డి, శ్రీరాములురెడ్డి, సర్పంచ్ రమేష్ బిల్లా, మండల మైనారిటీ సెల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సయ్యద్ షామీర్, బాబు, మండల సచివాలయాల కన్వీనర్ కిషోర్, ఎంపీటీసీ హరికృష్ణారెడ్డి, నాగరాజు, పంచాయతీ కన్వీనర్ పెద్దప్పయ్యరెడ్డి, నాయకులు మురళి, కుమార్, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.